క్లుప్తంగా

ఓటర్ స్లిప్పుల పంపిణీ



ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్లకు పోలింగ్ స్లిప్పులను అధికారులు శనివారం పంపిణీ చేస్తున్నారు. మున్సిపాలిటీలో 15 వార్డులకు గాను 21,656 మంది ఓటర్లు ఉన్నారు. వీరందరూ ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా, పోలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ తెలిపారు.

చిన్నారులకు బాటిల్స్ అందజేత



చిన్నారులకు బాటిల్స్‌ను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని దేవేందర్‌నగర్ కాలనీలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతహీ సేవ పథకం కింద అంగన్‌వాడీ చిన్నారులకు వాటర్ బాటిల్స్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా డీజీఎంఎస్ఎస్ సైంటిస్ట్ రాజాబాబు మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం బాటిల్స్‌ను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యాదగిరిరెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

బైకును ఢీకొట్టిన వాహనం

ఒకరు మృతి, మరొకరికి గాయాలు



గౌసుద్దీన్ (ఫైల్)

మొయినాబాద్: గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మొయినాబాద్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన మహ్మద్ గౌసుద్దీన్(46), అతని స్నేహితుడు అబ్దుల్ రహీంతో చేవెళ్ల నుంచి మొయినాబాద్‌కు బయలుదేరాడు. హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై మొయినాబాద్ సమీపంలోని కిరణ్ వే బ్రిడ్జ్ వద్ద గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గౌసుద్దీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. రహీం గాయపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దొరల పాలనకు స్వస్తి



చేవెళ్ల: సమావేశంలో మాట్లాడుతున్న కేఎల్లార్

చేవెళ్ల: రాష్ట్రంలో దొరల పాలనకు స్వస్తి పలకాలని మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్) పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్, నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి, ప్రచార కమిటీ సభ్యుడు సున్నపు వసంతంతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌లే ధరల పెరుగుదలకు కారణమని, అలాంటి వారిని నమ్మొద్దని సూచించారు. ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే సాగుకు సాయం, ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని తెలిపారు. చేవెళ్లలో భీంభరత్‌ను గెలిపించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పహాడీషరీఫ్: బస్సు దిగే క్రమంలో కింద పడిపోయిన ప్రయాణికుడి పైనుంచి ఆర్టీసీ బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఉదయం 10 గంటలకు సంతోష్‌నగర్ నుంచి నాగర్‌కర్నూల్ జిల్లాలోని గుడిగానిపల్లికి వెళుతుంది. జల్‌పల్లి కమాన్ వద్ద బస్సు ఎక్కిన గుర్తు తెలియని వ్యక్తి పహాడీషరీఫ్‌లోని పోచమ్మ ఆలయం మలుపు వద్దకు రాగానే రన్నింగ్‌లోనే బస్సు నుంచి దూకాడు. మూలమలుపు ఉండడంతో ఒక్కసారిగా వెనుక టైర్ కింద పడిపోయాడు. చక్రాలు పైనుంచి పోవడంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.



రాందాస్‌పల్లిలో మహనీయుల విగ్రహాలకు నివాళి అర్పిస్తున్న కిషన్‌రెడ్డి



గడ్డమల్లయ్యగూడలో ప్రచారం చేస్తున్న మౌనిక, బీఆర్ఎస్ నాయకులు

అద్దంలా ‘ఆదిబట్ల’

- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో అభివృద్ధి
- కంపెనీల ఏర్పాటుతో ఉపాధి
- ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు
- పనిచేసే వారికే పట్టం కట్టండి
- బీఆర్ఎస్ అభ్యర్థి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీని అద్దంలా తీర్చిదిద్దామని బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీలోని రాందాస్‌పల్లి, చింతపల్లిగూడ, మల్సెట్టిగూడ, బొంగ్లూర్, మంగళ్‌పల్లి, సాహేబ్‌గూడ, కొంగరకలాన్, ఆదిబట్ల పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిబట్ల మున్సిపాలిటీకి పేరు ప్రఖ్యాతలు వచ్చాయని తెలిపారు. ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. అలాగే కొంగరకలాన్‌లో జిల్లా కలెక్టరేట్, ఎలక్ట్రానిక్స్ దిగ్గజ సంస్థ ఫాక్స్‌కాన్ ఏర్పాటుతో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు.

కేసీఆర్ సహకారంతో..

సీఎం కేసీఆర్ సహకారంతో ఎల్‌బీనగర్ నుంచి బొంగ్లూర్ వరకు మెట్రో రైల్ పొడగించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇస్తామని ప్రకటించారు. ఎన్నికల అనంతరం దళితబంధు, రేషన్ కార్డులు, సామాజిక పెన్షన్లు అర్హులకు ఇస్తామని హామీ ఇచ్చారు. తొమ్మిదిన్నర ఏళ్ల పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందజేశామని గుర్తుచేశారు. ప్రజలంతా అభివృద్ధికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ మంచికి మారుపేరైన మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మంగళ్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగయ్య, మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ కళమ్మ, కౌన్సిలర్లు వనం శ్రీనివాస్, మహేందర్, మౌనిక, సంధ్య, నాగేశ్, కో–ఆప్షన్ సభ్యుడు గోపాల్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు దండెం రాంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్‌గౌడ్, తిరుమల్‌రెడ్డి, వీరారెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

మామ గెలిస్తే మంత్రి అవుతాడు

యాచారం: మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోడలు మంచిరెడ్డి మౌనిక అభ్యర్థించారు. శనివారం గడ్డమల్లయ్యగూడ గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ వృద్ధులను, రైతులను, మహిళలను కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మామ గెలిస్తే మంత్రివుతాడు, అధిక నిధులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేస్తారని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లను నమ్మొద్దు

- సీపీఎం నాయకుడు బీవీ రాఘవులు

యాచారం: కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటేనని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. అధికారం కోసం సాధ్యం కాని హామీలిస్తూ ప్రజలను మోసగించేందుకు ఈ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని, ప్రజలు నమ్మొద్దని హితవుపలికారు. ఇబ్రహీంపట్నం సీపీఎం అభ్యర్థి పగుడాల యాదయ్యకు మద్దతుగా శనివారం చింతుల్ల గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం పేదవాడి ఆకలి తీర్చేందుకు ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ బలపర్చిన కొండిగారి రాములు, మస్కు నర్సింహులు ఎమ్మెల్యేలుగా గెలిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. కార్మికులకు వేతనాల పెంపు, రైతాంగ సమస్యలు, మహిళలపై జరిగే దాడులపై రాజీలేని పోరాటం చేసిన ఘనత సీపీఎంకే దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్, మాజీ కార్యదర్శి భూపాల్, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న రాఘవులు

కాలుష్య కంపెనీని ఎత్తివేయాలి

కందుకూరు: నారాయణపేట జిల్లా చిత్తనూరులో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ కంపెనీని ఎత్తివేసేలా, మహేశ్వరం ప్రజల మద్దతు కావాలని చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధులు కోరారు. శనివారం మండల కేంద్రంలో కమిటీ సభ్యులు ఎం.రాఘవాచారి, డి.చంద్రశేఖర్, ఎస్ఎం ఖలీల్, జె.చక్రవర్తి, ఎర్ర మోహనకృష్ణ, టీపీజేఏసీ నాయకులు కె.రవిచందర్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. కాలుష్య కారకమైన ఆ కంపెనీతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ఆ కంపెనీకి సంబంధించి ఇక్కడ పోటీ చేస్తున్న కేఎల్లార్ భాగస్వామి అని ఆరోపించారు. వ్యాపారవేత్తగా ఉన్న ఆయనిని ఓడించాలని పిలుపునిచ్చారు.

కంపెనీతో నాకు ఎలాంటి సంబంధం లేదు

ఆ కంపెనీతో నాకు గాని నా కుటుంబానికి సైతం ప్రస్తుతం ఎలాంటి సంబంధం లేదన్నారు. ప్రారంభంలో భాగస్వామిగా ఉన్నాను. ఎవరూ వేలెత్తి చూపవద్దనే ఉద్దేశంతో ఆ కంపెనీ నుంచి వైదొలిగాను. అనవసరంగా నన్ను బదనాం చేయొద్దు.

– కేఎల్లార్

ప్రతి హామీని అమలు చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

- బీఆర్ఎస్ పాలనలో పేదలకు అన్యాయం
- మాట తప్పిన కేసీఆర్
- కాంగ్రెస్ అభ్యర్థి రంగారెడ్డి

తుర్కయంజాల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి హామీని అమలు చేస్తామని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రకటించారు. శనివారం తుర్కయంజాల్ చౌరస్తాలో సాగర్ రహదారిపై నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క హామీని కూడా అమలు చేయలేదని దుయ్యబట్టారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో యువకులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అంతేకాకుండా ఈ పాలనలో పేదలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఉద్యోగాల భర్తీ చేపడుతామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణంతో పాటు ఇతర హామీలను నెరవేర్చుతామని పేర్కొన్నారు. 30వ తేదీన హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే విచారణ జరిపి.. కల్వకుంట్ల కుటుంబసభ్యులను జైలుకు పంపుతామని హెచ్చరించారు. మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపు ఖాయమని, ప్రజలంతా ఆయనకు మద్దతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్‌లు మల్‌రెడ్డి అనురాధ, కొత్త ఆర్తిక, స్వప్న, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి రాకపోవడంతో...

తుర్కయంజాల్‌కు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వస్తున్నారనే సమాచారంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి జన సమీకరణ చేపట్టారు. అయితే ఆయన పర్యటన రద్దు కావడంతో నాయకులు, కార్యకర్తలు నిరాశకు గురయ్యారు.

కాంగ్రెస్‌లో చేరిక

మంచాల: మంచాల మండలంలోని బోడకొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్, సీపీఎం పార్టీలకు చెందిన పలువురు శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మల్‌రెడ్డి రంగారెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని తేల్చిచెప్పారు. అందరూ ఐకమత్యంతో పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. అందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు.



సభకు హాజరైన ప్రజలు

కాంగ్రెస్ గెలుపు ఖాయం



కందుకూరు: కేఎల్లార్ సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

- కేఎల్లార్‌కు మద్దతుగా జోరుగా ప్రచారం
- మంఖాల్ పారిశ్రామికవాడలో సీపీఐ

మహేశ్వరం: మహేశ్వరం గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి, అమీర్‌పేట్, కోళ్లపడకల్, నందుపల్లి, తుమ్మలూరు గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ దళితులు, గిరిజనులు, బీసీలకు అసైన్డ్ భూములను పంచడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తుందన్నారు. వృద్ధులు, వితంతువుల పింఛన్లను పెంచుతామన్నారు. మహేశ్వరంలో కాంగ్రెస్ భారీ మెజార్టీతో గెలుస్తుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటే అన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, కుమార్, ప్రవీణ్, చంద్రమోహన్, శ్రీకాంత్, రాజేందర్, పాండు, ప్రవీణ్, ఆనంద్, నర్సింహా, భిక్షపతి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

కేఎల్లార్‌కు మద్దతుగా సీపీఐ ప్రచారం

మండల కేంద్రం, మంఖాల్ పారిశ్రామిక వాడలో శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్మిక సంఘం నేతలు కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్లార్‌ను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయన్నారు. నాయకులు దత్తు నాయక్, యాదయ్య, గణేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కందుకూరు: మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి ఆధ్వర్యంలో శనివారం కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. హన్మంత్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, కిషన్, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులకు కండువాలు కప్పి ఆహ్వానించారు. తన విజయానికి కృషి చేయాలని కోరారు. యాదయ్య పాల్గొన్నారు.

కేసీఆర్ మోసపూరిత హామీలను నమ్మొద్దు

కాంగ్రెస్ సీనియర్ నేత భాస్కర్‌రెడ్డి



వాసవ కాలనీలో ప్రచారం చేస్తున్న దేప భాస్కర్ రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించి సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని మహేశ్వరంనియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీ, హరిపురి కాలనీ, లక్ష్మీనగర్, యాదవ్ నగర్ కాలనీల్లో సీనియర్ కాంగ్రెస్ మహిళా నాయకురాలు తమలపాకుల హర్షలత, యువజన నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డితో కలిసి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తూ ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, యువజన కాంగ్రెస్ నాయకులు జ్ఞానేశ్వర్ యాదవ్, శేఖర్ ముదిరాజ్, శ్రీశైలం, నిర్మలారెడ్డి,శకుంతల సోనీ, సుచరిత చౌదరి తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమమే ముఖ్యం

- అందెలను భారీ మెజార్టీతో గెలిపించాలి
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ



మాట్లాడుతున్న సత్యనారాయణ

కందుకూరు: మహేశ్వరంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య ఆధ్వర్యంలో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 75 ఏళ్లుగా రాజకీయంగా బీసీలను అణగదొక్కుతున్నారన్నారు. బీసీ వ్యతిరేక ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు. సాధించుకున్న తెలంగాణలో 95 శాతం బీసీలు ఆత్మార్పణ చేశారని, తాను ఒక్కడే సాధించనట్లు అధికారాన్ని అనుభవిస్తూ దోచుకుంటున్నాడని కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. కార్యక్రమంలో ఆ సంఘం జాతీయ కార్యదర్శి సుధాకర్‌ముదిరాజ్, విద్యార్థి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఆగం కావొద్దు.. అభివృద్ధిని ఆపొద్దు



తుక్కుగూడ: ప్రచార రథంపై గొర్రె పిల్లతో సబితారెడ్డి

- ఆలోచించి ఓటెయ్యండి
- బీఆర్ఎస్ మహేశ్వరం అభ్యర్థి సబితారెడ్డి

తుక్కుగూడ: ఎన్నికల సమయంలో ప్రజలు ఆగం కావొద్దు.. ఆలోచించి ఓటు వేయాలని మంత్రి సబితారెడ్డి సూచించారు. శనివారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని రావిర్యాలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రంలో గ్యారెంటీ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో ఆ పార్టీ నాయకులు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపుతున్నారన్నారు. బీజేపీ గత పదేళ్ల నుంచి కేంద్రంలో అధికారంలో ఉండి రాష్ట్రానికి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీదే అన్నారు. మరింతగా రాష్ట్రం పురోగతి సాధించాలంటే కేసీఆర్ సీఎం కావాలన్నారు. కారు గుర్తుపై ఓటు వేసి మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్ నాయకులు సురేష్, చంద్రశేఖర్ రెడ్డి, శివశంకర్, నాగేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కష్టాల్లో కనిపించనోళ్లు ఓట్లకు వస్తున్నారు

మీర్‌పేట: కష్టాల్లో కనిపించని వారు నేడు ఓట్ల కోసం వస్తున్నారని మహేశ్వరం బీఆర్ఎస్ అభ్యర్థి సబితారెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని హుడా కాంప్లెక్స్, జనప్రియ, అయోధ్యనగర్, ప్రశాంతి నగర్, మురళీకృష్ణనగర్, లెనిన్‌నగర్, బృందావన్‌కాలనీలలో శుక్రవారం రాత్రి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో వర్షాలకు మీర్‌పేట ప్రాంతం ముంపునకు గురైతే ప్రస్తుతం పోటీలో ఉన్న నాయకులు ట్రాక్టర్‌లో తిరిగారన్నారు. మోకాలి లోతు నీటిలో తాను ఇంటింటికి వెళ్లి భరోసా ఇచ్చారన్నారు. కరోనా సమయంలోనూ ప్రజలకు ధైర్యం ఇవ్వలేదని, ఎన్నికలు ఉన్నందున ప్రజలంతా ఆలోచించాలని అన్నారు. కార్యక్రమంలో మేయర్ దుర్గ, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి నాయకులు కౌశిక్‌రెడ్డి, శ్రీనునాయక్, భూపేష్‌గౌడ్ పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ

- పోలింగ్ కేంద్రాల పెంపు
- అభ్యర్థులు, ఓటర్లు సహకరించాలి
- రంగంలోకి ప్రత్యేక బలగాలు
- ఆర్ఓ అనంతరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అనంతరెడ్డి

ఇబ్రహీంపట్నం: నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని ఇబ్రహీంపట్నం ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించిన తనిఖీల్లో రూ. 11.72 కోట్ల నగదు, బంగారం, గంజాయి, మద్యం, సిల్వర్, సెల్ ఫోన్లను పట్టుకుని, సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో 3,27,583 ఓటర్లకు గాను 343 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం ఓటర్లలో పురుషులు 1,65,760, మహిళలు 1,61,786, ట్రాన్స్‌జెండర్స్ 37 మంది ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 756 పీఓ, ఏపీఓలతో పాటు ఇతర సిబ్బంది 756 మందిని నియమించినట్లు తెలిపారు. 26 మంది సెక్టార్ అధికారులకు వారం రోజుల పాటు మెజిస్ట్రీయల్ పవర్స్‌ను ఎన్నికల కమిషన్ ఇచ్చినట్లు వెల్లడించారు. 7 ఎంసీసీ, 8 ఎఫ్ఎస్‌టీ, 10 ఎస్ఎస్‌టీ, 2 వీఎస్‌టీ, ఒక వీవీటీ, అకౌంటింగ్ టీమ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. 205 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌లైవ్, 168 కేంద్రాల్లో అవుట్ సైడ్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల భద్రత కోసం ప్రత్యేక పోలీసు బలగాలు రంగంలోకి దిగినట్లు పేర్కొన్నారు. ఎలాంటి అవకతవకలు జరుగకుండా ఎన్నికల నిర్వహణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, అభ్యర్థులు, ఓటర్లు సహకరించాలని అనంతరెడ్డి కోరారు.

పోస్టల్ బ్యాలెట్ సెంటర్ పరిశీలన

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ 408 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా మొదటిరోజు 108 మంది పోస్టల్ బ్యాలెట్ పద్ధతిలో ఓట్లు వేసినట్లు వెల్లడించారు.

మాయమాటలు నమ్మి మోసపోవద్దు

- జబర్దస్త్ ఫేం కొమురక్క



ప్రచారంలో మాట్లాడుతున్న కొమురక్క

షాద్‌నగర్‌రూరల్: ఎన్నికల సమయంలో నేతలు చెప్పే మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని జబర్దస్త్ ఫేం కొమురక్క సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డికి మద్దతుగా శనివారం ఫరూఖ్‌నగర్ మండలపరిధిలోని కడియాలకుంట తండా, బూర్గుగడ్డ తండా గ్రామ పంచాయితీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురక్క మాట్లాడుతూ ఓట్ల కోసం మాయమాటలు చెప్పి డబ్బులు, మద్యంతో ప్రజల ముందుకు వస్తున్న నేతలను నమ్మొదన్నారు. ప్రలోభాలకు లొంగొద్దని సూచించారు. ప్రజల కష్ట సుఖాలు తెలిసిన విష్ణువర్ధన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. తండాల్లో నీటి సమస్యను గుర్తించి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు.